# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో వివిధ రంగాల్లో ప్రముఖ సంస్థల ద్వారా 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ❖ పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా ఈనెల 26 నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ లో పర్యటించనున్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద 2.22 లక్షల మంది లబ్దిదారులు నమోదయ్యారని కేంద్ర సహాయ మంత్రి శోభ కరంద్లాజే వెల్లడించారు.
- ❖ భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్‌లో రెండవ రోజు భోజన విరామ సమయానికి భారత్ 6 వికెట్లు నష్టపోయి 321 పరుగులు చేసింది.
- ❖ ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణం కేంద్రం తెలిపింది.

=========================

రాష్ట్రంలో వివిధ రంగాల్లో ప్రముఖ సంస్థల ద్వారా 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు జరిగిన మంత్రి వర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఆ వివరాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వివరించారు. పెట్టుబడులు అన్నీ కార్యరూపం దాలిస్తే లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. అదే విధంగా ఐటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్, ఆటోమొబైల్ రంగాల్లో పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని మంత్రి వివరిస్తూ..

(వాయిస్ 38 సెకన్లు)

ఇదిలా ఉండగా త్వరలో ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు.

=========================

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద ఇప్పటిదాకా 2 లక్షల 22 వేల మంది లబ్దిదారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే వెల్లడించారు. ఈ మేరకు లోక్ సభలో తెలుగుదేశం పార్టీకి చెందిన సభ్యులు కేశినేని శివనాథ్, బస్తిపాటి నాగరాజు అడిగిన ప్రశ్నకు ఆమె లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. చేతిపనులు చేసే సంప్రదాయ వృత్తులకు చెందిన కళాకారులు, చేతివృత్తుల వారు ఆర్థికంగా స్వయం సమృద్ధి కావాలన్న లక్ష్యంతో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 17న ప్రారంభించిందని తెలిపారు. ఈ పథకంలో నమోదు అయిన ప్రతి లబ్దిదారుడికి ప్రాథమిక నైపుణ్య శిక్షణా ఇస్తున్నట్లుగా ఆమె వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక శిక్షణ కేంద్రాల ద్వారా వేలాది మందికి శిక్షణను అందిస్తున్నామని చెప్పారు.

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో క్యూపిఐఏఐ సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్ అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమరావతి క్వాంటం వ్యాలీలో క్యూపిఐఏఐ సంస్థ భాగస్వామ్యం కావాలన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఏఐ సంస్థ సంసిద్ధతను తెలియచేశారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉపకరించే ఆవిష్కరణలు, అలాగే, విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆయనకు సూచించారు. అదే విధంగా అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఆ సంస్థను చంద్రబాబు నాయుడు కోరారు.

========================

ఆడపిల్లలకు భద్రత కల్పించడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జిల్లా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆడపిల్లలు తప్పిపోయిన ఘటనల మీద, కౌమారదశలో గర్భం దాల్చిన కేసుల మీద ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పని ప్రదేశాల్లో గాని, పాఠశాలలు, కళాశాలల్లో లైంగిక వేధింపులు ఉంటే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆమె సూచిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

========================

జలవనరుల సద్వినియోగంతో కరవు కాటకాలను నివారించవచ్చని సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు నిరూపించారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశంసించారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్రంలో నదుల అనుసంధాన ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఆయనకు నివాళి అర్పించారు.

========================

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ లో పర్యటించనున్నారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు 6 రోజుల పాటు ఆయన ఆ దేశంలో పర్యటించి దిగ్గజ సంస్థల ప్రతినిధులు, యాజమాన్యాలు, ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో సమావేశం కానున్నారని అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పారిశ్రామిక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను వివరించి పెట్టుబడిదారులను ఆహ్వానించనున్నారు. రాష్ట్రంలోని పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, హార్బర్లు, భూముల లభ్యత, కనెక్టివిటీ, 1,053 కిలో మీటర్ల తీర ప్రాంతంతో పాటు నిపుణులైన మానవ వనరులు గురించి ముఖ్యమంత్రి పెట్టుబడిదారులకు వివరించనున్నారు. ఈ ఆరు రోజుల పర్యటనలో సీఈఓలు, కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలను రక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులను త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని చైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. విజయవాడలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని, సాంకేతికత ద్వారానే వీటిని అరికట్ట వలసిన అవసరం ఉందన్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం 2018లో ఏపీ సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్ (APCSOC)ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ సంస్థ ప్రభుత్వ విభాగాలకు సైబర్ సెక్యూరిటీ ముప్పు రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తుందని ఆయన వెల్లడించారు.

========================

సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధనను అందించడంతో పాటు సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. స్వర్ణాంధ్ర - 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను సాధించేందుకు కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలో ఎ.కొండూరు, రెడ్డిగూడెం, గంపలగూడెంలలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

========================

భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో రెండవ రోజు భోజన విరామ సమయానికి భారత్ 6 వికెట్లు నష్టపోయి 321 పరుగులు చేసింది.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,726 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై... చివరికి 542 పాయింట్ల నష్టంతో 82,184 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157 పాయింట్ల నష్టంతో 25,062 వద్ద ముగిసింది.

========================

ఉత్తర బంగాళాఖాతంలో ఈ రోజు అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రానున్న 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలను వాతావరణ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================
========================